జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం బరాజ్ దిగువన ఆగిపోయిన ఇసుక లోడింగ్

అన్నారంలో తవ్వుడు బంద్

- ఇసుక తవ్వకాలను నిలిపేసిన అధికారులు
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

వరంగల్, జనవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణకు తాగు, సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు స్ఫూర్తికి విరుద్ధంగా అన్నారం బరాజ్ దిగువన ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. 'బరాజ్‌ను బలిపెట్టి.. ఇసుక కొల్లగొట్టి' శీర్షికతో బుధవారం 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో వచ్చిన కథనంతో రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కి పడింది. హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నారం బరాజ్ దిగువన ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. మూడు పెద్ద పొక్లెయినర్లతో వందల లారీల్లో ఇక్కడ ఇసుక లోడింగ్ ఆగిపోయింది. బరాజ్ దిగువన బుధవారం ఒక్క పొక్లెయిన్, ఒక్క లారీ కనిపించలేదు. అధికారులు వచ్చి అన్నింటినీ గోదావరి నది ఒడ్డునకు తరలించారు. ప్రభుత్వ అనుమతితో అన్నారం క్వారీలో ఇసుక తవ్వుతున్న కాంట్రాక్టర్లు, కింది స్థాయి ఉద్యోగులు కలిసి బరాజ్ దగ్గరగా తవ్వకాలు జరిపారని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చినట్టు తెలిసింది.

ఎమ్మెల్యేలకు రాసిన బహిరంగ లేఖను విడుదల చేస్తున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

పాలమూరు-రంగారెడ్డి రీడిజైన్‌తో నష్టమే

- ఉమ్మడి పాలమూరు జిల్లాకు తీరని అన్యాయం
- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి
- 14 మంది ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖలు

మరికల్, జనవరి 8 : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును రీడిజైన్ చేస్తే తీరని అన్యాయం జరుగుతుందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని పాలమూరు-డిండి ప్రాజెక్టుగా మార్చాలనుకోడం సరికాదని, ఇదే గనుక జరిగితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన నారాయణపేట జిల్లా మరికల్‌లో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభిస్తే.. కాంగ్రెస్ దాన్ని రీడిజైన్ చేసేందుకు యత్నిస్తున్నదని దుయ్యబట్టారు. జూరాల డ్యాం నుంచి 90 కి.మీ దిగువకు నీటి కేటాయింపులను మార్చితే రైతులకు నీళ్లు అందే పరిస్థితి లేదని అన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే సీఎంను నిలదీయాలని సూచించారు. ఈ సందర్భంగా 14 మంది ఎమ్మెల్యేలకు ఆయన బహిరంగ లేఖలను రాశారు.

మా శవాలపై రోడ్డేసుకోండి!

సాకిబండతండా రైతుల తిరుగుబాటు

- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు
- అధికారులపై అన్నదాతల తీవ్ర ఆగ్రహం
- పొలాల్లోనే బైఠాయించి గిరిజనుల నిరసన
- సాకిబండతండాలో నినాదాలతో ఉద్రిక్తం
- చేసేదిలేక వెనక్కి వెళ్లిపోయిన సర్వేబృందం

సాకిబండతండాలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న గిరిజన రైతులు

ఆమనగల్లు, జనవరి 8: 'మా ప్రాణాలు బోయినా రోడ్డేయనియ్యం.. బలవంతంగా లాక్కోవాలని చూస్తే ప్రాణత్యాగానికీ వెనుకాడం.. అప్పుడు మా శవాలపై రోడ్డు వేసుకోండి' అంటూ సాకిబండ తండా గిరిజన రైతులు తెగేసి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండోవిడత గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు సర్వేను బుధవారం గిరిజన రైతులు అడ్డుకున్నారు. తమ ప్రాణాలు కోల్పోయినా సరే సర్వే జరగనిచ్చే ప్రస్తకే లేదని, ఆ సర్వే జరిగే ప్రదేశంలోనే బైఠాయించి ధర్నా నిర్వహించారు. రైతులు తిరుగుబాటుతో సర్వేబృందం పైఅధికారులకు సమాచారం అందించి సర్వే జరపకుండానే వెనుదిరిగి వెళ్లిపోవాల్సి వచ్చింది. కందుకూరు మండలం బేగరికంచ వద్ద నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ కోసం తొలి విడతగా కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ నుంచి పంజాగూడ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి సర్వే పూర్తిచేసింది. రెండో విడుతలో భాగంగా 21 కి.మీ పొడవున 330 అడుగుల వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం 554 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండాకు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, సర్వే బృందం రావడంతో వారిని గిరిజన రైతులు అడ్డుకున్నారు. 'ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మా భూముల్లో సర్వేచేసే అధికారం మీకెక్కడిదని అధికారుల బృందంపై గిరిజన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించవద్దని ఎమ్మెల్యే, డీఆర్వో, ఆర్డీవోలను కలిసి వినతిపత్రం అందజేసినా మళ్లీ సమాచారం లేకుండా రావడమేమిటి? మాకున్న పావు ఎకరం, అర్ధెకరం, ఎకరం, రెండెకరాలను రోడ్డు కోసం తీసుకుంటే మా జీవనం సాగేదెట్లని అధికారులను నిలదీశారు''

పొలాల్లో హోరెత్తిన రైతుల నినాదాలు

తమ భూములు బలవంతంగా లాక్కోవాలని చూస్తే తాము ప్రాణత్యాగానికైనా వెనుకాడమని గిరిజన రైతులు తేగేసి చెప్పారు. రోడ్డు వేయాల్సివస్తే తమ శవాల మీదుగా వేయాల్సి వస్తుందని హెచ్చరించారు. 'అధికారులు గో బ్యాక్, మా ప్రాణలైనా అర్పిస్తాం- గ్రీన్ ఫీల్డ్ రోడ్డు అడ్డుకుంటాం' అన్న రైతుల నినాదాలు పొలాల్లో మార్మోగాయి. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. గిరిజన రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రైతులు రవిరాథోడ్, మణిపాల్, బోడ్యా, చందర్, పాండు, రమేశ్, గోపి, లాలు, విజేందర్, రాజా, వినోద్, గోపి, శివరాం, జాన్యా, పత్య, కుమార్, హరి, తరుణ్, కుమార్, మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మా శవాలపై గ్రీన్ ఫీల్డ్ నిర్మాణం చేపట్టండి

గ్రీన్ ఫీల్డ్ రోడ్డు కోసం మా భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వం. మాకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ మేము మా పిల్లలు జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం బలవంతంగా రోడ్డు కోసం మా భూమిని లాక్కుంటే మాకు మాత్రం చావే దిక్కు. మేము చచ్చాక మా శవాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించుకోండి.

– నేనావత్ చంప్లీ, సాకిబండతండా

సీఎం స్వార్థం కోసమే ఈ రోడ్డు

సీఎం రేవంత్‌రెడ్డి స్వలాభం కోసమే ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మిస్తున్నారు. మాకు 4 కిలో మీటర్ల దూరంలోనే 765 జాతీయ రహదారి ఉన్నది. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్త శుద్ధి ఉన్నా ఆ జాతీయ రహదారిని అభివృద్ధి చేయండి. ఈ రోడ్డు ఎవరి కోసం నిర్మిస్తున్నాడో సీఎం మాకు చెప్పాలి. ఈ రోడ్డేస్తే నాకున్న 5 ఎకరాలు పోతుంది. ఇక నేను హైదరాబాద్‌లో వాచ్‌మ్యాన్‌గా బతకాలి.

– రవి రాథోడ్. సాకిబండతండా

మాకే రోడ్డూ వద్దు సారూ

ఈ భూములు మా తాతల తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చినవి. ఈ భూములను నమ్మి మేము వ్యవసాయం చేసుకుంటూ మా పిల్లలకు చదివించినం, పెండ్లీలు చేసినం. ఇప్పుడు వచ్చి అర్ధంతరంగా రోడ్డు వేస్తామంటే మా బతుకులు ఆగమై పోతాయి సారు. మీకు దండాలు పెడ్తాం, మీ కాళ్లు మొక్కుతాం.. మాకే రోడ్డూ వద్దు సారూ.

– నేనావత్ కేస్లీ, సాకిబండతండా

సరిగ్గా తిండి తినలేకపోతున్నం

రోడ్డు నిర్మిస్తరని, మా భూమి మొత్తం పోతుందని తెలిసింది. అప్పటి నుంచి మా ఇంట్ల సరిగ్గా తిండి కూడా తినడం లేదు. నిద్ర కూడా పట్టడం లేదు. ఈ వయస్సులో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. మా పొలాలెంట దొంగల్లాగ వచ్చి మిషన్లు పట్టుకుని తిరుగుతున్నరు. మేము మాత్రం రోడ్డు కోసం మా భూములను ఇవ్వం. అవసరమైతే నా భూమిలోనే సచ్చిపోత.

– లచ్యా, సాకిబండతండా

మా గిరిజనులపై ముఖ్యమంత్రి కక్షగట్టిండు

సీఎం రేవంత్ మా గిరిజనులపై కక్షగట్టిండు. మొన్న లగచర్లలో గిరిజన రైతుల నుంచి భూములు లాక్కునే ప్రయత్నం చేసిండు. అక్కడ గిరిజన రైతులు తిరగబడితే వాళ్లను జైల్లో పెట్టించిండు. మళ్లీ మా ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు అని మా గిరిజన రైతులకు ఉన్న కొద్దిపాటి భూములను లాక్కొనే ప్రయత్నం చేస్తుండు. ఇది మంచి పద్ధతి కాదు. ప్రభుత్వానికి గిరిజనుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రోడ్డును రద్దుచేయాలి.

– పత్యానాయక్, బీఆర్‌ఎస్ ఆమనగల్లు అధ్యక్షుడు

ఇసొంటి సీఎంని ఎప్పడూ చూడలే

నా జీవితంలో ఇప్పటివరకు ఇసొంటి సీఎంని చూడనేలేదు. మా ప్రాంతమోడని ఓట్లేసి గెలిపించిరు. ఇప్పటివరకు రైతు భరోసా లేనే లేదు. రుణ మాఫీ సక్రమంగా చేయనేలేదు. అభివృద్ధి చేస్తడని గెలిపిస్తే మా భూములనే లాక్కుంటుండు. మాకు ఏ రోడ్డు లేకున్నప్పుడే మేము మంచిగా బతికినం. ఈ రోడ్డుతో మాకు ఏ పనీ లేదు. మా భూముల జోలికి మాత్రం రావొద్దు. వస్తే మా ప్రాణాల్ని పణంగా పెడతాం.

– సభావత్ వెంకటి

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

- సంక్షేమ కార్యక్రమాలు అమలు
- పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కాంగ్రెస్ సర్కారు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశామని, జనవరి 26 నుంచి రైతుభరోసా ఇవ్వనున్నామని తెలిపారు. పాతబస్తీలో కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్‌కి మాజీ ప్రధాని దివంగత మన్మోహన్‌సింగ్ పేరు పెట్టినట్టు తెలిపారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

'పాలమూరు ప్రాజెక్టుపై దృష్టి పెట్టండి'

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వీలైనంత త్వరగా మూడో ప్యాకేజీ పనులను పూర్తిచేయాలని సూచించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో బుధవారం జరిగిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో పాలమూరు ప్రాజెక్టు పనుల పురోగతిని, క్షేత్రస్థాయిలో ఇబ్బందుల గురించి అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్యాకేజీ 3లో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు చేపట్టిన ప్రధాన కాల్వ తవ్వకం పనులను వీలైనంత త్వరగా పూర్తిగాచేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరానికి తాగునీటిని సరఫరా చేసే పుట్టంగండి సిస్టర్న్‌కు మరమ్మతు చేయించాలని సూచించారు. లీకేజీల కారణంగా మూడు నెలలు పడుతుందని అధికారులు వివరించారు. తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయం చూడాలని ఆదేశించారు. రిజర్వాయర్‌పై నిర్మాణ సంస్థతో కలిసి సంయుక్త తనిఖీలు చేపట్టాలని సూచించారు.

సీఎం రేవంత్‌కు పాస్‌పోర్ట్ రిటర్న్

- విదేశీ పర్యటన కోసం పిటిషన్
- ఓటుకు నోటు కేసులో పాస్‌పోర్టు జప్తు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 8(నమస్తే తెలంగాణ): ఆస్ట్రేలియా, సింగపూర్, దావోస్ పర్యటన కోసం సీఎం రేవంత్‌కు పాస్‌పోర్టు జారీ చేస్తూ ఏసీబీ కోర్టు బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్ బెయిల్ షరతుల ప్రకారం పాస్‌పోర్టును ఏసీబీ కోర్టులో జమ చేశారు. ప్రస్తుతం విదేశీ పర్యటన కోసం పాస్‌పోర్టు జారీ చేయాలని రేవంత్ తరపు న్యాయవాది పిటిషన్‌పై వాదనలు విన్న కోర్టు 50వేల సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. పూచీకత్తును కోర్టుకు సమర్పించిన తర్వాత పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి రేవంత్ రెడ్డి పాస్‌పోర్ట్‌ను తెప్పించింది. రేవంత్ తరపున ఆయన సోదరుడు పాస్‌పోర్టును తీసుకుంటున్నట్టు కోర్టులో సంతకం చేశారు. ఈ నెల 14న విదేశీ పర్యటనకు వెళ్లనున్న రేవంత్‌రెడ్డి 20 నుంచి 22వ తేదీ వరకు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకానమిక్ ఫోరం 55వ వార్షిక సమావేశంలో పాల్గొననున్నారు.

పరీక్షలు రద్దు కాదు.. అభిప్రాయాల సేకరణ

- ఏపీలో ఇంటర్ విద్యలో సంస్కరణలు
- సెకండియర్ పరీక్షల్ని మాత్రమే నిర్వహించేలా పరిశీలన
- జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా సిలబస్
- ఏపీ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా వెల్లడి

హైదరాబాద్, జనవరి 8 (నమస్తేతెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్ విద్య సంస్కరణలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రు లు, విద్యావేత్తల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రద్దు అంటూ కొంత మంది చేస్తున్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. ప్రజలెవరూ ఇలాంటి వదంతులు నమ్మొద్దని ఆమె సూచించారు. బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇంటర్ విద్యలో సంస్కరణలు చేపడుతున్నట్టు వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో మినహా మిగతా రాష్ట్రాల బోర్డుల్లో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు నిర్వహించడం లేదని, సెకండియర్ పరీక్షల్ని మాత్రమే నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ నిర్ణయం మేలు చేస్తుందని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా కళాశాలలు ఫస్టియర్ పరీక్షలను ఇంటర్నల్‌గా నిర్వహిస్తాయని, 2025-26 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ ప్రవేశపెడుతున్నట్టు వెల్లడించారు. కొత్త ముసాయిదా ప్రకారం ప్రతి సబ్జెక్టులో ఇంటర్నల్, ప్రాక్టికల్స్ తప్పనిసరని తెలిపారు. ప్రజలు తమ సూచనలను జనవరి 26లోగా biereforms@gmail. com మెయిల్‌కు పంపాలని సూచించారు. సంస్కరణల విధానాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

ఆర్థిక కష్టాల్లో టీజీపీఎస్సీ

- నిధులు అడ్కుకోవాల్సి వస్తున్నది
- యూపీపీఎస్సీ, ఎస్సెస్సీ ఫార్మాట్‌లో ఉద్యోగాల భర్తీ
- ప్రశ్నపత్రం తయారీలోనూ సమూల మార్పులు
- ఇష్టాగోష్టిలో టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : టీజీపీఎస్సీ ఆర్థికంగా కష్టాల్లో ఉందని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం వ్యాఖ్యానించారు. ఏటా యూపీఎస్సీకి ఇచ్చే నిధులు ఏప్రిల్ 1న ఠంచన్‌గా ఖాతాలో పడుతున్నాయని, కానీ మన దగ్గర ఆ పరిస్థితిలేదని వాపోయారు. బడ్జెట్‌ను అడుక్కోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు లేక బయోమెట్రిక్ హాజరును ఇంప్లిమెంట్ చేయలేకపోయామని గతంలో కమిషన్ హైకోర్టుకు చెప్పిందని గుర్తుచేశారు. బుధవారం నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో తనను కలిసిన విలేకరులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇక పోటీ పరీక్షల సిలబస్, పరీక్షల విషయంపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. గ్రూప్-2లో నాలుగు, గ్రూప్-3లో మూడు పేపర్లున్నాయని, ఇన్ని పేపర్లు అవసరమా..? అన్న కోణంలో అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ విషయంలో యూపీఎస్సీ, ఎస్సెస్సీ అనుసరించనున్నట్టు పేర్కొన్నారు. కొన్ని పరీక్షలు ఆన్‌లైన్‌లో, మరికొన్ని ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. ఇక నుంచి ప్రశ్నపత్రాల విధానాన్ని మారుస్తామని, 5-10వేల ప్రశ్నలతో ప్రశ్నల నిధిని(క్వశ్చన్‌బ్యాంక్) రూపొందించనున్నామని పేర్కొన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ గల పోస్టులను ఏడాదిలో, మరికొన్ని పోస్టులను 6-8 నెలల్లో, ఇంకొన్నింటిని మూడు నాలుగు నెలల్లో భర్తీ చేసేచేసేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. మార్చి 31లోపు గ్రూప్-1, 2, 3 ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో గ్రూప్-2 ప్రాథమిక 'కీ'ని విడుదల చేస్తామని పేర్కొన్నారు.

11, 12న కాన్ఫరెన్స్

11, 12న జాతీయ స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల కాన్ఫరెన్స్ బెంగళూరులో జరగనుందని బుర్రా వెంకటేశం తెలిపారు. సదస్సులో పలు రాష్ట్రాల చైర్మన్లతో భేటీ అయ్యి, ఉత్తమ విధానాలపై అధ్యయనం చేస్తామని పేర్కొన్నారు. ఇక 23న యూపీఎస్సీ చైర్‌పర్సన్ హైదరాబాద్ రానున్నారని, ఇంటర్వ్యూ విధానంపై మార్పులపై ఆస్కీలో సదస్సు ఉంటుందని వెల్లడించారు.

ఏపీ, తెలంగాణలో ఐటీ సోదాలు

దేశవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో తనిఖీలు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : ఐటీ రియల్ లైఫ్ 'బంటీ ఔర్ బబ్లీ' కేసులో హన్సిక, అనిల్‌కుమార్ మహంతి రెండ్రోజుల క్రితం భువనేశ్వర్‌లో అరెస్ట్ అయ్యారు. వీరు ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ అల్లుడు, కూతురిగా చెప్పుకుంటూ పలుచోట్ల వసూళ్లకు పాల్పడ్డారు. ప్రభుత్వం ద్వారా పనులు చేయిస్తామంటూ పలు కంపెనీల నుంచి 100 కోట్లకు పైగా డబ్బులు వసూలు చేశారన్న సమాచారంతో బుధవారం ఆంధ్రా, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా 12ప్రాంతాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏపీ, భువనేశ్వర్, ఢిల్లీ, జార్ఖండ్, హైదరాబాద్‌లో నాలుగుచోట్ల సోదాలు జరిగాయి. నిందితులు లగ్జరీ కార్లు, అధునాతన విల్లాలు కొనుగోలు చేసినట్టు గుర్తించారు.

దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పునరుద్ధరించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- ఘనంగా ఇప్టా 90 వసంతాల వేడుకలు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రజల సాంస్కృతిక మేల్కొలుపులో ఇండియన్ ప్యూపిల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) మూలాలు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇప్టా 90 వసంతాల వేడుకలు హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ సామాజిక బాధ్యత, జాతీయ సమైక్యతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నాటకం, పాటలు, నృత్య రూపకాలను రూపొందించి భారత సాంస్కృతిక వారసత్వాన్ని పునరుద్ధరించాలని తెలిపారు. నటుడు, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్‌రావు, ప్రముఖ అభ్యుదయ రచయిత కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ కవి, అభ్యుదయ రచయిత ఏటుకూరి ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అరసం జాతీయ నాయకుడు ఆర్వీ రామారావు, ప్రముఖ సినీ నటుడు మాదాల రవి, నిర్మాత మద్దినేని రమేశ్, తెలుగు వర్సిటీ మాజీ వీసీ డా. ఎస్వీ సత్యనారాయణ, ఇప్టా రాష్ట్ర నాయకులు రాజేశ్వర్‌రావు, జానకీరాం పాల్గొన్నారు.

13 నుంచి ఐనవోలు బ్రహ్మోత్సవాలు

పాల్గొనాలని సీఎంను కోరిన మంత్రి సురేఖ

హైదరాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ): ఈ నెల 13 నుంచి ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ కోరారు. ఈ మేరకు బుధవారం ఆహ్వానపత్రికను అందజేశారు. ఆలయ ఈవో, సిబ్బంది సీఎంకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

బీసీ గురుకులాలకు అదనంగా 256 కోట్లు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల నిర్వహణకు ప్రభుత్వం అదనంగా రూ.256 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గురుకులాలకు ప్రభుత్వం రూ.251 కోట్లను ప్రతిపాదించగా, ఆ మేరకు నిధులను విడుదల చేసింది. తాజాగా గురుకుల ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చుల నిర్వహణకు అదనంగా రూ.256 కోట్లు విడుదల చేసింది. మరోవైపు సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు రూ.13.50కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

గేమ్ ఛేంజ్!

మొదటిపేజీ తరువాయి...

ఉదయం 4 గంటల నుంచి బెనిఫిట్‌షోలు ప్రదర్శించేందుకు, ఆ రోజు 6 షోలు, 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఐదు షోలు ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చారు. అంతేకాదు, 10న అదనంగా మల్టీప్లెక్స్‌లో రూ.150, సింగిల్ స్క్రీన్లలో రూ.100, 11-19 వరకు మల్టీప్లెక్సుల్లో రూ.100, సింగిల్ స్క్రీన్లలో రూ.50 టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన ప్రతిజ్ఞలు, ఇచ్చిన ప్రకటనలు వట్టి బూటకమేనా? అని నెటిజన్లు మండిపడుతున్నారు. 'అసెంబ్లీలో సీఎం మాటకు ఉన్న విలువ ఇదేనా?' అని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి 'ఎక్స్'లో ప్రశ్నించారు. ఇది క్విడ్‌ప్రోకో కాదా? అని నిలదీశారు. ఆ సినిమా నిర్మాత దిల్‌రాజు ఎఫ్‌డీసీ చైర్మన్‌గా ఉన్నారని, ఆయనకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం జీవోలు ఇవ్వడం నేరం కాదా? అని ప్రశ్నించారు.

బీసీ ఉద్యోగుల అధ్యక్షుడిగా చంద్రశేఖర్

హైదరాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ): బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రమ ఎన్నికయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన వారిని అభినందించారు.

17న జస్టిస్ ఘోష్ రాక

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ 17న హైదరాబాద్‌కు రానున్నారు. ప్రాజెక్టుపై విచారణను తిరిగి కొనసాగించనున్నారు. ఫిబ్రవరితో కమిషన్ ఏర్పడి ఏడాది పూర్తికానున్న ఈ నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ దఫా విచారణ పూర్తి చేసి నివేదికను సమర్పించాలని జస్టిస్ ఘోష్ భావిస్తున్నట్టు కమిషన్ వర్గాలు వెల్లడించాయి.

త్వరలో సోలార్ ప్లాంట్ల టెండర్ల ఖరారు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): మహిళా సంఘాలకు కేటాయించిన వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్ల టెండర్లను త్వరలోనే ఖరారు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు 150 ఎకరాలకు తగ్గకుండా స్థలాన్ని సేకరించాలని తెలిపారు.

ఏఈఈలకు వేతనాలు ఇవ్వండి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జనవరి8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇచ్చారనే కారణంతో నిలిపేసిన పలువురు ఇంజినీర్లకు వెంటనే వేతనాలను చెల్లించాలని సీఎస్ శాంతికుమారిని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నీటిపారుదల శాఖలో ఇటీవల కొత్తగా 677 మంది ఇంజినీర్లను నియమించారు. వారిలో 130 మందికి రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇచ్చారనే కారణంతో జీతాలు ఇవ్వడం లేదు. ఈ విషయాన్ని ఇంజినీర్లు మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వెంటనే సీఎస్‌కు ఫోన్ చేసి తక్షణమే వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నెలాఖరునాటికి పదోన్నతులు: ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సాగునీటి పారుదల శాఖలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ఈ నెలాఖరునాటికి పూర్తిచేస్తామని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణా ఏఈఈల అసోసియేషన్ రూపొందించిన 2025 డైరీని బుధవారం ఆయన ఆవిష్కరించారు. జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మానవ వనరులు, మౌలిక వసతులపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. సంవత్సరం వ్యవధిలో 700 ఏఈఈ పోస్టులు, 1,800 లష్కర్ల పోస్టుల భర్తీ చేపట్టామని, మరో 1,300 ఉద్యోగ నియామకాలకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. విధి నిర్వహణలో నిబద్ధత, పారదర్శకతతో వ్యవహరించాలని, ఇరిగేషన్ శాఖ ప్రతిష్ఠను కాపాడేందుకు యువ ఇంజినీర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఎన్సీలు జనరల్ అనిల్ కుమార్, హరిరాం, విజయ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈఎన్సీ కే శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమంపై సమీక్ష

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : మహిళా శిశు సంక్షేమంపై బుధవారం సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క హాజరై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖలకు కేటాయించాల్సిన బడ్జెట్ అంచనాలపై చర్చించారు. వారు మాట్లాడుతూ.. అంగన్వాడీ పిల్లలపై పెట్టే పెట్టుబడి వారి అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం అందించడంతో వారికి ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా కేంద్రాల్లోని మహిళా ప్రాంగణాల స్థితిగతులపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క ఆరా తీశారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వెదురు వస్తువులు ఉపయోగించాలి

మంత్రి సీతక్క

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : ప్రజలంతా ప్లాస్టిక్ బదులుగా వెదురు వస్తువులను ఉపయోగించాలని మహిళా శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఏర్పాటుచేసిన వ్యవసాయ వెదురు వర్క్‌షాప్‌నకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో మహిళా సంఘాల ద్వారా వెదురు సాగును ప్రోత్సహించి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యాచరణతో వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు.